సులభ్ కాంప్లెక్స్ లేక ఇబ్బందులు

- పట్టించుకోని అధికారులు
- ప్రధాన కూడళ్లలో నిర్మించాలని వేడుకోలు

నారాయణపేట టౌన్: దినదినాభివృద్ధి చెందుతున్న జిల్లా కేంద్రంలో సరైన సులభ్ కాంప్లెక్స్‌లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంగారు, చేనేత వస్త్రాలకు ఎంతో పేరు గావించిన జిల్లా కేంద్రానికి వందలాది మంది నిత్యం పనుల కోసం వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు కొనసాగిస్తుంటారు. ప్రధాన కూడళ్లలో మరుగుదొడ్లు నిర్మించకపోవడంతో ప్రజలు బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ పట్టణంలో అధికారులు ఆ దిశగా అడుగులు వేయట్లేదు.

పట్టణానికి ఒక్కటే..

పట్టణంలోని మెయిన్ రోడ్‌లో సులభ్ కాంప్లెక్స్ ఉన్నప్పటికీ అది ప్రజలకు సరిపోవడం లేదు.


జిల్లా కేంద్రంలో మెయిన్‌రోడ్‌లో ఉన్న సులభ్ కాంప్లెక్స్

అలాగే పాత బస్టాండ్, కూరగాయల మార్కెట్, యాద్గీర్‌రోడ్, అంబేడ్కర్ చౌరస్తాలలో అందుబాటులో లేకపోవడంతో కొత్త బస్టాండ్‌లో ఉండే మూత్రశాలలకు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రధాన కూడళ్ల వద్ద మరుగు దొడ్ల వసతి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రహదారుల వెంట సరిపడా మరుగు దొడ్లు లేక మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సెంటర్ చౌక్, సరాఫ్ బజార్‌లో ప్రాంతాలను నుంచి వచ్చే ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఇకనైనా సంబంధిత అధికారులు పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో సులభ్ కాంప్లెక్స్, మూత్ర శాలలు వంటివి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు..

పట్టణం మొత్తంలో సులభ్ కాంప్లెక్స్ ఒకటే ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పట్టణంలో ప్రధాన కూడళ్ల వద్ద కనీసం మూత్రశాలల సౌకర్యం అందుబాటులోకి తీసుకొస్తే బహరంగ ప్రదేశాలల్లో వెళ్లకుండా ఉంటారు.

– గణేష్, నారాయణపేట

మరుగుదొడ్లు నిర్మించండి..

జిల్లా కేంద్రంలో అభివృద్ధి జరుగుతున్నప్పటికీ ప్రధానంగా మరుగుదొడ్ల నిర్మాణం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో మార్కెట్ రోడ్‌లో ఉంటే వాటిని తొలిగించారు. ప్రస్తుతం ప్రధాన చౌరస్తాలో మరుగుదొడ్లు లేకుండా పోయాయి. అధికారులు మరుగు దొడ్ల నిర్మాణం చేసేలా దృష్టిసారించి సమస్య పరిష్కరించాలి

– శాంతమ్మ, నారాయణపేట.

నిర్మాణం చేసేలా కృషి చేస్తాం..

పట్టణంలోని రద్దీగా ఉండే ప్రాంతాల్లో మూత్ర శాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం పట్టణ రోడ్ విస్తరణ పనులు పూర్తయ్యాయి. గతంలో నిర్మాణ కోసం స్థలాలను గుర్తించాం. తర్వలోనే ప్రభుత్వ చిన్న పిలల్ల ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నారాయణపేట టౌన్: మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారు ఆర్థికంగా పురోగతి సాధించేందుకు పాటుపడాలని ఇందిరా ప్రియదర్శిని ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సీఈఓ గోవర్ధని అన్నారు. ఇందిరా ప్రియదర్శని ఉమెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అశోక్‌నగర్‌లోని ఓంశాంతి క్రరీ పాయింట్ సెంటర్‌లో మహిళా సంఘాలకు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేకంగా చిరు ధాన్యాలు, సిరి ధాన్యాలతో అల్పాహారం, భోజన ఉత్పత్తులు, రొట్టెలు, తీపి పదార్థాలు, చిరుతిళ్లు చేసి సంపూర్ణ ఆరోగ్యం కోసం అందించాలని సూచించారు. అనంతరం ప్రియదర్శిని ఉమెన్స్


గోవర్ధిని సన్మానిస్తున్న నిర్వాహకులు

వెల్ఫేర్ అసోసియేషన్ సీఈఓ గోవర్ధని, ఐకేపీ, టీఎంసీ లక్ష్మి, ఆర్పీ పుష్పను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కుమారి సుమలత, ఓం శాంతి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయిరాం

నారాయణపేట రూరల్: గుండెపోటు సమయంలో ప్రాణాలు కాపాడే సీపీఆర్ విధానంపై రిజర్వుడ్ పోలీసు బృందానికి బుధవారం అవగాహన కల్పించారు. ఆర్ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ సాయిరాం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ఒత్తిడి, ఆహార అలవాట్ల కారణంగా గుండెపోటు రావడంతో పాటు సకాలంలో వైద్యసేవలు అందక మరణాల సంఖ్య పెరుగుతోందని అన్నారు. సీపీఆర్ విధానంతో చాలావరకు మరణాల సంఖ్యను తగ్గించే అవకాశం ఉందన్నారు. యాక్సిడెంట్లు, పాముకాటు, కుక్కకాటు, పురుగుమందు తాగడం, అగ్నిప్రమాదం, నీటిలో పడి మునిగిపోతున్న సందర్భంలో టెన్షన్‌కు లోనవుతారని అన్నారు. ఈ క్రమంలో చాతిపై రెండు చేతులతో 100 నుంచి 120 సార్లు కంప్రెసర్ చేయాలని, ఈ సందర్భంలో దవడ భాగం లేపి ఉంచాలన్నారు. పోలీసులకు ఈ విధానంపై అవగాహన ఉండటం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు.

క్లుప్తంగా

రైతు రుణమాఫీ చేయాలి

మరికల్: రైతు రుణమాఫీ వెంటనే చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న, నాయకులు కృష్ణయ్య, రామకృష్ణ, హరీష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలు మోస పూరితంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో రుణమాఫీ గూర్చి మాట్లాడటం బీఆర్ఎస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏక కాలంలో రూ. రెండు లక్షల రుణాలను మాఫీ చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రజలు కేసీఆర్ మాటలను నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టంచేశారు. కర్ణాటక మాదిరిగా తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మొగులప్ప, ఆంజనేయులు, శేఖర్, సత్యన్న పాల్గొన్నారు.

వేసవి తరగతులు ప్రారంభం



మరికల్: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎలిగండ్లలో బుధవారం నుంచి వేసవి తరగతులను సర్పంచ్ దేవమ్మ, ఉప సర్పంచ్ మోహన్ ప్రారంభించారు. రోజుకు రెండు గంటల పాటు చిన్నారులకు తరగతులను నిర్వహిస్తారని తెలిపారు. వేసవి క్లాస్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నర్సింహ మృతికి సంతాపం

నారాయణపేట టౌన్: సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి వర్గ సభ్యుడు ఈర్ల నరసింహ బుధవారం మృతి చెందారు. ఆయన మృతిపై సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఈర్ల నరసింహ బిజినేపల్లి మండలం వెలిగొండ సర్పంచ్, ఎంపీటీసీగా ప్రజా సేవ చేస్తూ మంచి గుర్తింపు పొందారని, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సీపీఐ కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తూ ఎన్నో ప్రజా సేవ కార్యక్రమాలను చేపట్టారని, ఆయన మరణం ప్రజా పోరాటాలకు, పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటు మిగిల్చిందని వాపోయారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో చౌక్ బజార్‌లో 1982–83లో ఇంటర్ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆర్టీఓ వీరస్వామి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రావు ప్రారంభించారు. అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు ప్రజల దాహం తీర్చేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. వీరి సేవలు విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాయిబాబా, సత్యనారాయణరెడ్డి, బీవీఎస్ రెడ్డి, జగదీష్, రామకృష్ణ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

బస్సును పునరుద్ధరించాలి

ధన్వాడ: మండలంలోని కొండ్రోన్‌పల్లి, గోటూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యావర్గ సభ్యుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం కొండ్రోన్‌పల్లిలో గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా గోటూర్ కొండ్రోన్‌పల్లి గ్రామాల నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్లే బస్సు సౌకర్యాన్ని అధికారులు నిలిపివేశారని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే బస్సును పునరుద్ధరించాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎల్లప్ప, అంజిల్‌రెడ్డి, హనుమంతు, రాములు, వేణుగోపాల్, సంజీవరెడ్డి, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

గ్రామసభలు ఏర్పాటు

ధన్వాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో జిల్లా అధికారుల ఆదేశానుసారం పారిశుధ్యంపై ప్రత్యేక గ్రామ సభలను నిర్వహించారు. గ్రామాల్లో మురుగు కాల్వల్లో ఉన్న మట్టిని తొలగించి నీరు నిల్వకుండా చూడాలని, అలాగే ఇంటి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామ సభలో చర్చించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మెప్మా, పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిరాశ్రయుల కేంద్రం నిర్వహించడానికి ఆసక్తి గల స్వచ్ఛంద సంస్థలు, పట్టణ సమాఖ్యలు, నెహ్రూ యువ కేంద్రాలు, సంక్షేమ సంబంధ సంస్థల నిర్వాహకులు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సునీత ఒక ప్రకటనలో బుధవారం కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆత్మకూర్: జూరాల 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ నర్సింహ తెలిపారు. అమరచింత, ఆత్మకూర్ మండలాల వినియోగదారులు సహకరించాలని కోరారు. అమరచింతలోని 33/11కేవీలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


గ్రామంలో పర్యటిస్తున్న జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దాసర్‌దొడ్డి గ్రామస్తుల వినతి మేరకు ఆయన గ్రామంలో పర్యటించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. త్వరలో తాగునీరు అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని మాద్వార్ వీరాబ్రహ్మంగారి ఆలయంలో బుధవారం వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య, సత్యనారాయణ, విష్ణు, విశ్వనాథ్, భగవంతు, శంకరప్ప, ఘనపురం వెంకటప్ప పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



మద్దూరు: మండలంలోని మోమినాపూర్ నుంచి చెన్నారెడ్డిపల్లి మీదుగా మద్దూరు వస్తున్న ఆటో బోల్తా పడి పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని చెన్నారెడ్డిపల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. దామరగిద్ద మండలంలోని బాపన్‌పల్లికి చెందిన నెల్లి నర్సప్పకు(60) తలకు గాయం కావడంతో కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన మరో ముగ్గురిని మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తం


అవగాహన కల్పిస్తున్న కల్పిస్తున్న ఎస్ఐ నరేందర్

మాగనూర్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేందర్ అన్నారు. బుధవారం మండలంలోని అచ్చంపేటలో సైబర్ నేరాల, మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పోలీసు కళాజాతా బృందం ఆట పాటల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే వ్యక్తిగత సమాచారం చెప్పొద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రూక్యానాయక్, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

సాల్మన్‌రాజ్‌ను ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలి

ఆత్మకూర్: క్రైస్తవ కమ్యూనిటీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్, పాస్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సాలమాన్‌రాజ్‌కు ఎమ్మెల్సీ పదవికి నామినేట్ చేయాలని పాస్టర్లు డిమాండ్ చేసారు. బుధవారం ఆత్మకూర్‌లోను బెత్లేహేం చర్చిలో జిల్లాలోని పాస్టర్లు సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలకు సమానహక్కును కల్పిస్తూ ముందుకెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లసంఘం నాయకులు రేవా సీపీ జర్మీయా, ఎస్ఎన్ రాజు, ఆర్నాల్డ్, ఏమేంజలిస్ట్, క్రైస్తవులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు

మద్దూరు: మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, జై కిసాన్ ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం ఏఈ ఉదయ్‌కాంత్, ఎస్ఐ శీనయ్య తనిఖీ చేశారు. పత్తి విత్తనాలు వాటి ప్రమాణాలు, లాట్ నెంబర్లు, కాల పరిమితిని పరిశీలించారు.

మక్తల్: నిబంధనల మేరకు విత్తనాలు, ఎరువులు విక్రయించాలని ఎస్ఐ పర్వతాలు, ఏఓ మిథిన్ చక్రవర్తి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను వారు తనిఖీలు చేపట్టారు. రికార్డులను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు.

మాగనూర్: నకిలీ విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేందర్, ఇన్‌చార్జ్ ఏఓ సుదర్శన్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని


మద్దూరులో..

మాగనూర్, కొత్తపల్లి గ్రామాలలోని సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాలను వారు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్‌లు తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1500 బస్తాలపై విచారణ చేస్తాం


రైతులతో మాట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

నర్వ: మండలంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన వరి ధాన్యం కొనుగోలులో 1500 బస్తాల ధాన్యం అదనంగా వచ్చిందని, దీనిపై బుధవారం పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి నర్వ విండో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 8 తకోట్లల్లో వచ్చిన 1500 బస్తాలు అదనంగా వచ్చిన మాట వాస్తవమని చెప్పారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామన్నారు. ఈ సంఘటనపై మిల్లుల్లో తీస్తున్న తరుగా లేక సిబ్బంది తప్పిదమా అనే కోణంలో విచారణ చేయిస్తామని, దోషులెవరైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సొసైటీ ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీఈఓ ఉదయ్‌కుమార్ సిబ్బంది రాజశేఖర్, జగదీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

'రైల్వే గేటు మూయకుండా ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారు'

దేవరకద్ర: ఆర్వోబీ ప్రారంభం అయిన తరువాత దేవరకద్ర రైల్వే గేటును మూయకుండా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్వోబీ ప్రారంభించిన రోజే ఈ విషయంపై జిల్లా కలెక్టర్, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారని అన్నారు. గేటు మూస్తే పట్టణంలోని రెండు వైపులా ఉన్న ప్రజలు ఇబ్బందులకు గురవుతారని తెలిపారని వివరించారు. ఆర్వోబీ కేవలం దూర ప్రాంతాల నుంచి వచ్చేవాహన దారులు ఇబ్బందులు పడకుండా నేరుగా వెళ్లడానికి ఉంటుందని తెలిపినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తన లేటర్ ప్యాడ్‌పై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు లెటర్ పంపించారని, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కూడ గేటు విషయంలో మాట్లాడుతున్నారని జిల్లా కేంద్రంలోని బోయపల్లి గేటును ఎలా తెరిచారో అలాగే ఇక్కడ కూడా తెరిచి ఉంచే విధంగా చూస్తున్నారని వివరించారు. కాగా రైల్వే నిబంధనల ప్రకారం ఆర్వోబీ ప్రారంభం తరువాత గేటు మూయడానికి ఉత్తర్వులు జారీ చేశారని వాటిని కూడా వెనక్కి తీసుకునేలా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని ప్రజలు ఆందోళన చెందవద్దని సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కోస్గి: మండల పరిధిలోని సర్జఖాన్‌పేట గ్రామానికి చెందిన ఈస్వప్ప(42) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ హరీష్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.10 వేలు ఆర్థికసాయం అందించాడు.

డీఈని సస్పెండ్ చేయాలి



అమరచింత: మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో జరుగుతున్న రూ.3.30 కోట్ల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి భాస్కర్, మూడోవార్డు కౌన్సిలర్ విజయరాములు తెలిపారు. మూడో వార్డులో జరిగిన సీసీ రోడ్ల పనుల నాణ్యతపై బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రోడ్ల పరిశీలనకు వచ్చిన డీఈ శ్రీనివాసులను కలిసి రోడ్ల నాణ్యత, మంజూరు లిస్టులో ఉన్న మిగిలిన పనులను యధావిధిగా పూర్తి చేయాలని కోరడం జరిగిందన్నారు. సరైన సమాధానం ఇవ్వని డీఈ శ్రీనివాస్ కాంట్రాక్టర్‌కు తొత్తుగా మారి అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. నాణ్యత లేని సీసీ పనుల గురించి వివరణ ఇవ్వాలని కోరడంతో కౌన్సిలర్ విజయరాములుపై డీఈ దురుసుగా ప్రవర్తించడం దూషించడం తగదన్నారు. కాంట్రాక్టర్‌కు వత్తసు పలుకుతున్న డీఈపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. అవినీతి పనులకు ప్రోత్సహిస్తున్న డీఈని సస్పెండ్ చేసేవరకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో శ్యాం సుందర్, రవీందర్, మనప్ప, కుతుబ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ పెద్ద ఆంజనేయస్వామి ఆలయంలో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టారు. చివరిరోజు బుధవారం ఉదయం ఆలయంలో స్వామి వారికి అభిషేకం, అర్చన, హారతి తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దంపతులు హోమం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై పూజలు నిర్వహించారు.

కార్మికులకు వైద్య పరీక్షలు


కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నారాయణపేట రూరల్: మండలంలోని చిన్నజట్రంలో బుధవారం లేబర్‌కార్డు కలిగి ఉన్న ప్రతి కార్మికుడికి ఉచితంగా వైద్య పరీక్షలను చేయించారు. ముఖ్య అతిథిగా జిల్లా కార్మికశాఖ అధికారి రాజ్‌కుమార్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 50 రకాలైన పరీక్షలను నిర్వహిస్తారని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్మికులు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని, కుటుంబ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. శిబిరంలో దాదాపు 70మంది కార్మికులు పరీక్షలు చేయించుకున్నారని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, ఐఎఫ్‌టీయూ నాయకులు నర్సింహులు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

మక్తల్: పట్టణంలోని కాచ్‌వార్‌లో పారిశుద్ధ్యంపై బుధవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీధర్ మాట్లాడుతూ ఇళ్ల ముందు మురుగు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, కార్యదర్శి భాస్కర్, నీలేష్, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం


కంటి వెలుగు శిబిరం ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

మాగనూర్: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని వైస్ ఎంపీపీ తిప్పయ్య అన్నారు. బుధవారం మండలంలోని వర్కూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ నిర్మలమ్మతో కలిసి ఆయన కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ కృష్ణయ్య, గ్రామస్తులు మల్‌రెడ్డి, నర్సింహులు, లింగప్ప, అంజప్ప, వైద్య సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నుంచి చీఫ్ మినిస్టర్ కప్ క్రీడలను జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో విద్యార్థుల్లో దాగిన క్రీడా నైపుణ్యాలను బయటకు తీయడం కోసం ప్రభుత్వం చీఫ్ మినిస్టర్ కప్ క్రీడలను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంకోటి, సర్పంచ్ గోవర్ధన్, సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, వైస్ఎంపీపీ రవి, ఎంపీడీఓ సద్గుణ, ఎంపీటీసీ గోపాల్, శ్రీనివాస్‌రావు, రాజేష్, రామకృష్ణారెడ్డి, బాల్‌రాజ్, శివ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం..

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ శ్రీకళ అన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ మొదటి బహుమతి కింద రూ. 5 వేలు, రెండో బహుమతి కింద రూ. 3వేలతో పాటు షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో క్రీడల జిల్లా అధికారి రవికిశోర్, రవి, గోపాల్, గోవర్ధన్, రాజవర్ధన్‌రెడ్డి, తిరుపతయ్య, శేఖర్, బాలజీ, రాజేష్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: స్థానిక జాతరమైదానంలోని మినిస్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ పోటీలు ముగిశాయి. విజేతలకు ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, జెడ్పీటీసీ శివరంజని, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, విరేషలింగం తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో..

అమరచింత: మండల స్థాయిలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీఎం కప్ క్రీడలు బుధవారం ముగిశాయి. మొదటి రోజు క్రీడాకారుల పరిచయ కార్యక్రమంతో ముగించిన అధికారులు రెండో రోజు కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు. మూడోరోజు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, జెడ్పీటీసీ మార్క సరోజ, వైస్ఎంపీపీ బాల్‌రెడ్డి, కమిషనర్ మహమ్మద్ ఖాజా, ఎంపీడీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ


ఆత్మకూర్‌లో..